క్లుప్తంగా

పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేయండి



వార్డుల పర్యటనలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీలోని సంజీవనగర్, స్వరాజ్యనగర్ ప్రాంతాల్లో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పర్యటించారు. ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కాలువల్లో పూడికతీత పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. మంచినీటి పైపులైన్ లీకేజీలకు వెంటనే మరమ్మతులు చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు.

నేడు కస్తూర్బా పాఠశాలలో ఆధార్ శిబిరం

బ్రహ్మంగారిమఠం : మండలంలోని సోమిరెడ్డిపల్లె-2 సచివాలయం పరిధిలోని కస్తూర్బా బాలికోన్నత పాఠశాలలో శనివారం ఆధార్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ వెంగమునిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4న మల్లేపల్లె సచివాలయంలో ఆధార్ శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ ధనలక్ష్మీ పూజ



ధనలక్ష్మీదేవికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో దీపావళి పర్వదిన సందర్భంగా గురువారం రాత్రి శ్రీ ధనలక్ష్మీ పూజ నిర్వహించారు. ఆలయ అధ్యక్ష కార్యదర్శులు చాటకొండు సుబ్రమణ్యం(రత్నా), విశ్వనాథ్, జనార్ధన్ ఆధ్వర్యంలో జరిగింది. దాదాపు 3 లక్షల రూపాయల నోట్లను వినియోగించారు.

సర్దార్ పటేల్ జీవితం ఆదర్శం



పటేల్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఖాజీపేట : భారత దేశ తొలి రక్షణ శాఖ మంత్రి సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ దేశం కోసం చేసిన సేవ అందరికీ ఆదర్శ ప్రాయమని ఖాజీపేట ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. పటేల్ జన్మదినం సందర్భంగా ఖాజీపేట మేజర్ పంచాయితీ కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోని అంతర్గత సంస్థానాలను పూర్తిగా విలీనం చేసిన ఘనత ఆయనదే అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరునికి భస్మార్చన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అగస్త్యేశ్వరస్వామి మూలవిరాట్‌ను పూజా ద్రవ్యాలు, భస్మంతో అర్చించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

పోరుమామిళ్ల : ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలో గాంధీబొమ్మ సెంటర్, ఆర్టీసీ బస్టాండు, పంచాయతీ కార్యాలయం, హమాలీ వర్కర్స్ సెంటర్‌లలో జెండా ఎగురవేశారు.

ట్రాక్టర్ టైర్లు దగ్ధం

కాశినాయన : మండలంలోని పగడాలపల్లె ఫీడర్‌లో గోవర్ధన్‌రెడ్డి రైతు పొలంలో ట్రాక్టర్‌కు 11 కె.వి. విద్యుత్ వైర్లు తగిలి రెండు టైర్లు కాలిపోయాయి. రైతు గోవర్ధన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు బత్తాయి చెట్లకు ట్రాక్టర్ ద్వారా మందు పిచికారి చేస్తుండగా 11 కె.వి. వైర్లు తగిలి ప్రమాదం జరిగిందని తెలిపారు. విద్యుత్ వైర్లు కిందకి వేలాడుతున్నాయని నాలుగు నెలల నుండి ఏపీఎస్‌పీడీసీఎల్ ఏడీ, ఏఈలకు తెలిపినా పట్టించుకోలేదని, గతంలో కూడా ప్రమాదాలు జరిగాయని తెలిపినా పట్టించుకోలేదన్నారు.

సివిల్స్‌లో ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు కల్చరల్ : డిగ్రీ పూర్తి చేసిన యువతీయువకులకు సివిల్స్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, కోశాధికారి కోటా ఓబుళరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీకి చెందిన ప్రముఖ సివిల్స్ కోచింగ్ సంస్థ డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఈ నెల 3న ఆదివారం ఉదయం ఎస్‌కేఆర్‌సీ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

ఆలయాలకు కార్తీక శోభ

- నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం
- ముస్తాబైన శివాలయాలు



ప్రత్యేక అలంకరణలో వెల్లాలలోని భీమలింగేశ్వర స్వామి

రాజుపాళెం : ఆధ్యాత్మిక భావాలకు, ధార్మిక కార్యక్రమాలకు విడిదిగా నిలిచే కార్తీక మాసం శనివారం నుంచి ప్రారంభం కానుండటంతో శివాలయాలు ముస్తాబయ్యాయి. కార్తీక మాసంలో భక్తి ప్రపూరితం ముఖ్యంగా వేకువజామునే స్నానాలు, నోములు, వ్రతాలు, దీపోత్సవాలతో ఈ మాసమంతా సందడిగా ఉంటుంది. ఈ మాసాన్ని పురస్కరించుకొని అనేక మంది వన భోజనాలకు ప్రాధాన్యత ఇస్తారు. ఈ మాసంలో వచ్చే పౌర్ణమి ఎంతో ప్రీతిపాత్రమైంది. లేత చలిలో ప్రారంభమయ్యే కార్తీకం ముఖ్యంగా శివ భక్తులకు ఎంతో ప్రత్యేకమైనది. ఈ మాసమంతా శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోతాయి. రాజుపాళెం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలోని భీమలింగేశ్వర స్వామి, పార్వతీదేవి, చెన్నకేశవ, సంజీవరాయ స్వామి, టంగుటూరులోని సోమేశ్వరస్వామి, సోమాపురంలో శ్రీచక్రం కలిగిన శివాలయం, పర్లపాడులోని శివాలయం, రాజుపాళెంలోని సీతారామాలయం, కొర్రపాడులోని శివాలయం, అర్కటవేములలోని సోమేశ్వర స్వామి ఆలయం, గోపాయపల్లెలోని శివాలయం, గాదెగూడూరులోని సోమేశ్వర స్వామి తదితర గ్రామాల్లోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆ ఆలయాల్లో భక్తులు దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు చేయనున్నారు.

దీపాల విశిష్టత

కార్తీక మాసంలో శివకేశవులిద్దరికి పూజలు నిర్వహిస్తుండాలి. అలాగే దీపం తప్పనిసరిగా వెలిగించాలి. ఈ మాసంలో స్నానానికి, దీపానికి అధిక ప్రాధాన్యత ఉంది. ఇందువల్ల నదీ స్నానమాచరిస్తే పునీతులు అవుతారని పురోహితులు చెబుతున్నారు. శివాలయాల్లో దీపం వెలిగిస్తే పుణ్యం లభిస్తుంది. నువ్వుల నూనె, ఆవు నెయ్యితో దీపాలు వెలిగిస్తే సకల దోషాలు, పాపాలు హరించి, అభీష్టాలు నెరవేరుతాయని కార్తీక పురాణం చెబుతోంది.

కార్తీక పౌర్ణమి విశిష్టత

కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమి ఎంతో విశిష్టమైన రోజు. ఈ ఏడాది కార్తీక పౌర్ణమి ఈనెల 15న రానుంది. ఆ రోజున ఉసిరి దానం చేయడం వలన దారిద్ర్యం తొలగిపోతుంది. పౌర్ణమి రోజున శివునికి అభిషేకం చేయడం వల్ల ఆయుష్షు పెరుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. కార్తీక పౌర్ణమి రోజు లలితాదేవిని సహస్రనామాలతో పూజిస్తే సకల ఐశ్వర్యాలు లభిస్తాయని, తులసి మొక్కలతోపాటు ఉసిరి కొమ్మను పెట్టి పక్కన రాధాకృష్ణుల విగ్రహాన్ని ఉంచి పూజిస్తే పెళ్లి కాని యువతులకు వివాహ ప్రాప్తి లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి.

పవిత్రమైన మాసం

కార్తీక మాసం పరమ పవిత్రమైనది. ఈ మాసంలో నిష్ఠతో ఈశ్వరుడిని పూజిస్తే అంతకుమించిన మోక్షమార్గం మరొకటి లేదు. నిత్యం మేకువజామునే స్నానమాచరించి, శివాలయాల్లో దీపం వెలిగిస్తే సకల పాపాలు తొలగిపోతాయి. అష్ట ఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించబడతాయి.

– వెంకటా చలపతి, అర్చకుడు, వెల్లాల క్షేత్రం, రాజుపాళెం

వైఎస్సార్‌సీపీ నాయకులకు నివాళి



పెంచలబాబు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని సుమిత్రానగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ 16వ వార్డు కన్వీనర్ వనం పెంచలబాబు (49) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే పెంచలబాబు మృతి పార్టీకి తీరనిలోటని అన్నారు. పార్టీపరంగా ఆయన కుటుంబ సభ్యులకు అన్నిరకాలుగా అండగా ఉంటామని సూచించడంతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షులు సుందర్‌రామిరెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కలసపాడు : మండలంలోని సిద్దమూర్తిపల్లె వైఎస్సార్‌సీపీ బూత్‌కన్వీనర్ పాలకొలను విష్ణువర్ధన్‌రెడ్డి తండ్రి రామిరెడ్డి, కలసపాడు వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ కాతాసుబ్బారెడ్డి తండ్రి వెంకటసుబ్బారెడ్డిలు శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి ఇరువురి భౌతికకాయాలను సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కార్యక్రమంలో వైద్యాధికారులు

ప్రొద్దుటూరు క్రైం : మన చుట్టు ఉన్న పరిసరాలను, మన ఇంటిలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి మనోరమ తెలిపారు. మండలంలోని సోములవారిపల్లె పంచాయతీలోని సుబ్బారావు కొట్టాలు, ఈశ్వర్‌రెడ్డినగర్‌లో శుక్రవారం ఫ్రైడే – డ్రైడే కార్యక్రమంలో భాగంగా దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమకాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా జ్వరాలు వస్తాయన్నారు. దోమకాటుకు గురికాకుండా దోమతెరలను వాడాలని సూచించారు. ప్రొద్దుటూరు మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ నీటి తొట్లు, పాత టైర్లు, పారేసిన కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ టీ గ్లాసులు, పైకప్పు లేని నీటి ట్యాంకులు, వృథాగా ఉన్న రోళ్లు, కూలర్లలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఏఎంఓ వెంకటరెడ్డి, సీహెచ్‌ఓలు కృష్ణమ్మ, శిరీష, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్లు సుబ్బయ్య, శ్రీనివాస్, ఏఎన్ఎం ఉమారాణి, ఆశ కార్యకర్తలు శివజ్యోతి, వరలక్ష్మి, భాగ్యమ్మ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



బాలింతలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

బద్వేలు అర్బన్ : ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం తొట్టిగారిపల్లె సచివాలయం పరిధిలో నిర్వహించిన ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో పాత టైర్లు, పనికిరాని వస్తువులు, తాగిపడేసిన కొబ్బరిబోండాలు ఉంచుకోరాదని, అలా ఉంచుకోవడం ద్వారా అందులో వర్షపు నీరు నిల్వ ఉండి దోమల లార్వా వృద్ధి చెంది దోమలు పెరుగుతాయని అన్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కోరారు. అనంతరం దోమల వలన వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే టీకాలు, గర్భిణులు, బాలింతల సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ బ్రహ్మాజీ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, వైద్య సిబ్బంది పద్మావతి, వసుంధర, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని అన్ని హౌసింగ్ లేఅవుట్లలో ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ రాజారత్నం తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పలు హౌసింగ్ లేఅవుట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇంటి నిర్మాణాల ప్రక్రియ వేగవంతం చేయాలని, అందుకు అవసరమైతే మెప్మా ద్వారా అదనపు రుణం ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే సంబంధిత అధికారులు సకాలంలో బిల్లులు అందించేందుకు కృషి చేయాలని కోరారు. మార్చి 15 నాటికి ఇంటి నిర్మాణాలు పూర్తికాకపోతే నిధులు వెనక్కిపోయే అవకాశం ఉందన్నారు.

ఆ విషయంపై లబ్ధిదారులకు అవగాహన కలిగించాలని కోరారు. అలాగే బోవిళ్ళ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న 1100 ఇళ్ళు విజిలెన్స్ విచారణలో ఉన్నందున వాటిని తాత్కాలికంగా నిలిపివేయడం జరిగిందని, త్వరలోనే ఇంటి నిర్మాణ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

కాశినాయన : గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హనుమంతు తెలిపారు. శుక్రవారం నరసాపురం పోలీసుస్టేషన్ ఆవరణలో గతంలో బెల్టుషాపులు నిర్వహించి పోలీసు కేసులు నమోదైన వారిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు.

ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

అట్లూరు : స్థానిక శాంతినగర్ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బత్తినపెంచలయ్య (50) తీవ్ర గాయాలపాలయ్యాడు. నెల్లూరు జిల్లా నెల్లూరు నగరానికి చెందిన పెంచలయ్య అట్లూరు మండలం ముత్తుకూరు గ్రామంలోని తన బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వచ్చి సాయంత్రం తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో ఒక కాలు విరగడంతో పాటు తలకు బలమైన గాయమైంది. స్థానికులు బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దీపం పథకం ప్రారంభం

ప్రొద్దుటూరు : శ్రీనివాసనగర్‌లోని బాలాజీ గ్యాస్ ఏజెన్సీ వద్ద శుక్రవారం దీపం 2.0 పథకాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ గంగయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున పాల్గొన్నారు.

ఆర్‌ఓ వాటర్ ప్లాట్ ప్రారంభం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో శుక్రవారం తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌నాయుడు ప్రారంభించారు.

చలో విజయవాడను జయప్రదం చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఆదివారం చలో విజయవాడను నిర్వహిస్తున్నట్లు మహాసభ కన్వీనర్ సలీం తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 5 గంటలకు విజయవాడ కుమ్మారిపాలెం ఈద్గా మైదానంలో ఈ మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. పట్టణం నుంచి శనివారం బస్సులు బయలుదేరుతున్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 94400 94179, 94415 02186 నంబరుకు సంప్రదించాలని కోరారు.

ఘనంగా ధనలక్ష్మీ పూజ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో గురువారం దీపావళి సందర్భంగా ఘనంగా ధనలక్ష్మీ పూజ చేశారు. వేకువజామున శ్రీవాసవీమాత మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని ధనలక్ష్మీదేవిగా అలంకరించి కొలువుదీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించి కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య అధ్యక్షుడు బుశెట్టి రాం

ఘనంగా ఆరాధనోత్సవాలు



భక్తులకు భోజనం వడ్డిస్తున్న వేదపాఠశాల విద్యార్థులు, దేవాదాయశాఖ సిబ్బంది

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణగీతాశ్రమంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నామా ఎరుకలయ్య, కమలాక్షమ్మ ఆరాధనా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేణుగోపాల స్వామికి, మళయాల స్వామికి, ఎరుకలయ్య, కమలాక్షమ్మ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. గణపతిపూజ, కలశారాధన, భగవద్గీతా పారాయణం, తదితర పూజాకార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. 9వ తేదీ వరకు రోజూ ప్రత్యేక పూజాకార్యక్రమాలతో పాటు సాయంత్రం సాంసంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఈఓ రామచంద్రాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో శారదా జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సురేష్‌బాబు రెడ్డి, దేవాదాయ శాఖ సిబ్బంది విజయ్, ప్రసాద్, ఆశ్రమంలోని విద్యాసంస్థల ప్రతినిధులు, శైవాగమ వేదపాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. కాగా శనివారం సాయంత్రం 6 గంటలకు మోహినీ భస్మాసుర నాటక ప్రదర్శన జరుగనుంది.

దోమల నివారణకు చర్యలు



కుంటలో వదులుతున్న ఆయిల్‌బాల్స్

పోరుమామిళ్ల : పట్టణంలో దోమల నివారణకు శుక్రవారం మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ నరసింహారెడ్డి ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. పోరుమామిళ్ల సబ్‌యూనిట్ పరిధిలో కుంటలు, వాగుల్లో దోమలు అభివృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేశారు. ఇందువల్ల దోమ గుడ్డు పెట్టాక లార్వాకు ఆక్సిజన్ అందక చనిపోతుందని నరసింహారెడ్డి తెలిపారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలతో పట్టణంలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చే జ్వరాలు రాకుండా ఉండాలంటే ప్రతి కుటుంబం శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. అందరూ దోమతెరలు వాడాలని, జ్వరాలతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లవద్దన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించే సేవలు పొందాలన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ స్వామిరంగయ్య, ఏఎన్ఎంలు చామంతి, విజయ పాల్గొన్నారు.

జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పన అధికారి సురేష్ కుమార్

మైదుకూరు : ప్రతినెలా నిర్వహించే జాబ్ మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి సురేష్‌కుమార్ అన్నారు. మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ తక్కువ జీతమని భావించకుండా జాబ్ మేళాలో దొరికిన ఉద్యోగాల్లో చేరాలని పిలుపునిచ్చారు. ప్రారంభంలో ఒడిదుడుకులను తట్టుకుని అపార అనుభవాన్ని సంపాదించిన తర్వాత మంచి జీతభత్యాలతోపాటు హోదా లభిస్తుందన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి మాట్లాడుతూ మొదట స్కిల్ హబ్ నిర్వహించే వివిధ సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ పూర్తిచేసుకున్న వారికి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. మేళాకు మొత్తం 57 మంది అభ్యర్థులు హాజరవగా, 21 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు.

ఆర్ఎస్‌యూ మహాసభలను జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు : ఈనెల 15, 16 తేదీల్లో బద్వేలులో నిర్వహించే ఆర్ఎస్‌యూ 10వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ తెలిపారు. శుక్రవారం స్థానిక భావన జూనియర్ కాలేజీలో జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివద్ధి, విద్యార్థి, నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం ఆర్ఎస్‌యూ పోరాటాలు చేస్తోందన్నారు. ఈ మహాసభల్లో గత విద్యా సంవత్సరంలో నిర్వహించిన పోరాటాలను సమీక్షించుకుని భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తారని పేర్కొన్నారు. ఈ మహాసభల్లో విద్యార్థులు, నిరుద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా నాయకులు కొండేటి హరిబాబు, వంశీకృష్ణ, కిరణ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి

బద్వేలు అర్బన్ : ప్రస్తుత సమాజంలో బాలికలపై జరిగే అత్యాచారాలు, హత్యలను దృష్టిలో ఉంచుకుని బాలికలు అప్రమత్తంగా ఉండాలని బీసీ చైతన్యసమితి వ్యవస్థాపక అధ్యక్షులు బి.సి.రమణ తెలిపారు. శుక్రవారం స్థానిక రత్నం ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు చదువు పట్ల ఆసక్తి కలిగి ఉండి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధిస్తే సమాజంలో తమకంటూ ప్రత్యేక స్థానం ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తలారిరత్నం, అంబేడ్కర్ ఆశయసాధన సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎం.పిచ్చయ్య, పి.వెంకటరమణ, దళితవేదిక పట్టణ అధ్యక్షులు కేశవయ్య, సీనియర్ దళిత నాయకులు ఓ.ఎస్.వి.ప్రసాద్, నారాయణ, పాఠశాల ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లెల్లో ఏరులై పారుతున్న మద్యం



మాట్లాడుతున్న రెడ్యం

ఖాజీపేట : గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇచ్చి.. మరో చెత్తో విద్యుత్ ఛార్జీల భారం మోపారని ఏపీఎస్ఆర్టీసీ కడప జోనల్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి విమర్శించారు. దుంపలగట్టు గ్రామంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రూ 2,685 కోట్ల రాయితీ ఇచ్చి.. విద్యుత్తు సర్దుబాటు పేరుతో రూ.17,072 కోట్ల భారం ప్రజలపై మోపిందన్నారు. ప్రతి గ్రామంలో రెండు లేక మూడు బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి.. మద్యం ఏరులై పారేలా చేస్తూ, సీఎం చంద్రబాబు మాత్రం మద్యం అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు వచ్చిన షాపులను నిబంధనల పేరుతో రద్దు చేశారని అన్నారు.

ఆలయానికి వంట సామగ్రి వితరణ

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె భద్రకాళీ సమేత వీరభద్రస్వామి అన్నదాన సత్రానికి నరహరిపురానికి చెందిన వీరసుబ్బారెడ్డి, లక్ష్మీదేవి దంపతులు వంట సామాగ్రి అందజేశారు. రూ.25 వేల విలువ చేసే గ్రైండర్, ఇతర సామగ్రిని ఆలయ ఈఓ మేకల మారుతీప్రసాద్‌కు శుక్రవారం అందజేశారు.

ఘనంగా రాష్ట్రావతరణ దినోత్సవం



ప్రొద్దుటూరు కల్చరల్: అమరజీవికి నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్య ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం లైట్‌పాలెం సెంటర్‌లోని పొట్టి శ్రీరాముల విగ్రహానికి పలు కులసంఘాలు, స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు ఘనంగా నివాళి అర్పించారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయం నుంచి ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో ర్యాలీగా నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి రాష్ట్రానికి ఆ మహనీయుడు చేసిన సేవలను పలువురు వివరించారు. ఆయన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

ప్రొద్దుటూరు : ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక లైట్ పాలెం సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు తన ప్రాణాలను త్యాగం చేశారని వారు కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు వంకదార నరేంద్రరావు, జిల్లా ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పరమేశ్వరరావు, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు మోహన్, మహిళా అధ్యక్షురాలు నల్లదిమ్ము కుమారి, బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ గౌరీశంకర్, శివనాగిరెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి విక్రాంత్, రమేష్‌రెడ్డి, బాషా, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు అమరజీవి

మైదుకూరు : ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు అమరజీవి అని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మైదుకూరులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఎస్టీయూ నాయకులు శుక్రవారం నివాళి అర్పించారు. పొట్టి శ్రీరాములు అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రామకృష్ణారెడ్డి, వై.వెంకటసుబ్బయ్య, గోశెట్టి రామమోహన్, మీసాల మునెయ్య పాల్గొన్నారు. ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి దరిశ సునీల్‌కుమార్, సతీష్‌కుమార్, కటకం వెంకటసుబ్బయ్య, తదితరులు పూలమాల వేసి నివాళి అర్పించారు.

త్యాగానికి ప్రతీక పొట్టి శ్రీరాములు

చాపాడు : త్యాగానికి ప్రతీక అమరజీవి పొట్టి శ్రీరాములు అని నరహరిపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నరసింహశాస్త్రి తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయుడు చిత్రాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి తరానికి ఆదర్శం

బద్వేలు అర్బన్ : రాష్ట్రం కోసం అమరజీవి పొట్టిశ్రీరాములు చేసిన త్యాగం నేటి తరానికి ఆదర్శం కావాలని, ఆయన ఆశయ సాధన కోసం నేటి యువత కృషిచేయాలని ఆర్యవైశ్య వర్తకసంఘం అధ్యక్షుడు కె.వి.సుబ్బారావు తెలిపారు. ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి పాలాభిషేకం చేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చలమయ్య, చంద్రశేఖర్, సురేష్, వైభవ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

కలసపాడులో..

కలసపాడు : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం ఆర్యవైశ్యులు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గోపవరం : మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ ధనలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికలతో సమావేశానికి ఆయాశాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.